అధికారులు అప్రమత్తంగా ఉండాలి
● రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్
10లో..

గాలి గత్తరతో ఓటు వేస్తే ఆగమవుతాం..

- చేనేత పరిశ్రమకు జీఎస్టీ వేసినా తొలి ప్రదాని మోదీ
- బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు



సిరిసిల్లలో మాట్లాడుతున్న కేసీఆర్

సిరిసిల్ల, మే 10 (ఆంధ్రజ్యోతి): 'పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నాయి. మూడు పార్టీలు రంగంలో ఉన్నాయి. ఏ పార్టీలు ఏమి చేశాయో మీ అందరికి తెలుసు. గాలి గత్తరతో ఓటు వేస్తే మన బతుకులు ఆగమాగం అవుతాయి' అని బీఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు అన్నారు. శుక్రవారం రాత్రి కేసీఆర్ బస్సు యాత్ర రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ వేములవాడకు వచ్చిన ప్రధానమంత్రి దేవస్థానం



సిరిస్లిలలో జనసందోహం

అభివృద్ధికి ఒక్క రూపాయి ఇస్తానని చెప్పలేదని విమర్శించారు. కాంగ్రెస్ అలవీకానీ హామీలిచ్చి గద్దెనెక్కిందన్నారు. చేనేత కార్మికులను అవమానించారని ఒక్క మాట అన్నందుకు తనపై 48 గంటల నిషేధం పెట్టారన్నారు. దేశంలో చేనేతరంగంపై జీఎస్టీ వేసిన ఏకైక ప్రధాని నరేంద్రమోదీ అని అన్నారు. మోదీ ఇచ్చిన 150 హామీల్లో ఒక్కటీ నెరవేరలేదన్నారు. మిడ్ మానేరును ఎండబెట్టారని, గోదావరి నది పోతే తెలంగాణకు నీళ్ల రావన్నారు. రాష్ట్రంలో ఎంపీ సీట్లలో ఎక్కవ మనమే గెలవబోతున్నామని, కరీంనగర్‌లో వినోద్‌కుమార్‌కు నంబర్ వన్ మెజారిటీ ఇచ్చి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నాఫ్స్కాబ్ ఛైర్మన్ కొండూరి రవీందర్‌రావు, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పాల్గొన్నారు.

చివరి శ్వాస వరకు ప్రజా సేవ చేస్తా

● కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్ రూరల్, మే10: తన చివరి శ్వాస వరకు ప్రజాసేవ చేస్తానని కాంగ్రెస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. శుక్రవారం కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్, శ్రీపురంకాలనీ, నగునూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ఏడు లక్షల కోట్లు అప్పులు చేసి ప్రజల నెత్తిపై భారం మోపిందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు వినోద్‌కుమార్, బండి సంజయ్ కుమార్ ఏమీ అభివృద్ధి చేయలేదని విమర్శించారు. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ అయోధ్యలో శ్రీరాముడి విగ్రహా ప్రతిష్ట కాకముందే అక్షింతలు పంచి ప్రజలను మోసం చేసి ఓట్లను గుంజుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తన తండ్రి ఆశయ సాధన కోసం పేద ప్రజల శ్రేయస్సు కోసం పాటుపడతానని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి, మాజీ సర్పంచ్ పెంచాల లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.



బొమ్మకల్‌లో మాట్లాడుతున్న వెలిచాల రాజేందర్ రావు

పేదల సంక్షేమం మోదీతోనే సాధ్యం

● బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్



గన్నేరువరంలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

గన్నేరువరం, మే 10, దేశంలోని పేదల సంక్షేమం మోదీతోనే సాధ్యమని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల ప్రజలతో నిర్వహించిన బీజేపీ కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. తాను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సమస్యలపై కొట్లాడానని, తనపై 109 కేసులు పెట్టారని అన్నారు. కేసీఆర్‌ను గడీల నుంచి బయటకు తీసుకొచ్చింది తానేనన్నారు. దేశ ప్రజలే తన కుటుంబసభ్యులని భావించి మోదీ దేశానికి సేవ చేస్తున్నారని, ఆయన లేకపోతే దేశం శత్రుదేశాల ముందు కుక్క లు చించిన విస్తరిలాగా మారేదన్నారు. దేశాన్ని కాపాడుతున్నది మోదీ అని తెలిపారు. తనను మరోసారినుంచి పార్లమెంట్‌కు పంపిస్తే మోదీ సహకారంతో కరీంనగర్‌ను మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

సోషల్ ఆడిటింగ్

శంకరపట్నం, మే 10: ఉపాధిహామీ పథకం సోషల్ ఆడిటింగ్ ప్రజావేదిక కార్యక్రమం శుక్రవారం శంకరపట్నం మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈజీఎస్ పనులకు సంబంధించి ఆడిట్ చేసిన నివేదికను గ్రామాల వారీగా ప్రజావేదిక కార్యక్రమంలో అధికారుల ముందు చదివి వినిపించారు. కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీధర్, అడిషనల్ డీఆర్డీవో సంధ్యారాణి, ఎంపీడీవో శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

వీర్నపల్లి, మే 10: వీర్నపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసుపై శుక్రవారం విచారణ చేపట్టారు. ఆదర్శ పాఠశాలలోని సమస్యలపై అడిగిన కొనరావుపేట మండలానికి చెందిన హరీష్‌ను పాఠశాల ప్రిన్సిపల్ విశ్వనాథం కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేపట్టారు. విచారణలో ఇరువర్గాల నుంచి పూర్తి సమాచారం సేకరించారు. పాఠశాలకు వచ్చి సమస్యలపై కాకుండా బెదిరించి డబ్బులు అడిగారని పాఠశాల ప్రిన్సిపల్ విశ్వనాథం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హరీష్ అనే వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ తెలిపారు.











ఎన్నికలు ముగిసిన వెంటనే
ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్


మాట్లాడుతున్న శ్యాంసుందర్

జగిత్యాల, మే 10 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల మేరకు ఎన్నికలు ముగిసిన వెంటనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుక్కోవెల శ్యాం సుందర్, ప్రధాన కార్యదర్శి అంబటి భూమేశ్వర్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత అక్టోబర్ మాసంలో బదిలీ అయి రిలీవ్ చేయని ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని అన్నారు. బకాయి ఉన్న నాలుగు వాయిదాల డీఏను విడుదల చేయాలని, ఈ కుబేర్‌లో ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలన్నారు. జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని, మోడల్ స్కూల్స్‌లను విద్యా శాఖ పరిధిలోకి తీసుకొని రావాలన్నారు. గురుకులాలు, మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వేసవి సెలవుల్లోనే ముగించాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పాఠశాలల్లో విద్యా వలంటీర్లను, పారిశుధ్య కార్మికులను, అటెండర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అమలు చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు తగిన మౌళిక వసతులు కల్పించాలన్నారు. అన్ని నియోజకవర్గాల్లో ఒకే విధమైన ఎన్నికల పారితోషికం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై
బండి సంజయ్‌కు నోటీసులు

కరీంనగర్ అర్బన్, మే 10 : కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్‌కు ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. ఎన్నికల ప్రచారంలో నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల 6వ తేదీన కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మల్యాల సుజిత్‌కుమార్ జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదు పట్ల వివరణ కోరుతూ శుక్రవారం ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. ఈ నెల 11న ఎన్నికల అధికారి మున్సిపల్ కమిషనర్ ఎదుట విచారణకు హాజరుకావాలని బండి సంజయ్‌కుమార్‌కు ఇచ్చిన నోటీసులో పేర్కొన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘన
బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్‌పై కేసు నమోదు

జగిత్యాల టౌన్, మే 10 : ఎన్నికల నియమావళిని ఉల్లంఘనలో నిజామాబాద్ ఎంపీ, ప్రస్తుత బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్‌పై జగిత్యాల పట్టణ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. జగిత్యాలలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 8న కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డిని ఉద్దేశించి హిందువులకు జీవన్ రెడ్డి ప్రమాదకంగా మారాడు, పీఎఫ్ఐ ఉగ్రవాదుల పార్టీకి జగిత్యాల అడ్డాగా మారిందంటూ అర్వింద్ ఎన్నికల నియమావళి నిబంధనలకు విరుద్ధంగా మాట్లాడారు. అంతే కాకుండా మత విద్వేశాలు రెచ్చగొట్టే విధంగా ప్రత్యర్థి అయిన జీవన్ రెడ్డికి వ్యతిరేఖంగా మాట్లాడుతూ అర్వింద్ నిబంధనలకు విరుద్ధంగా వ్యక్తిగతంగా దూషణలు చేశాడు. జగిత్యాల అర్బన్, రూరల్ మండల ఎన్నికల ఎఫ్ఎస్‌టీ-5 ఇన్‌చార్జి మాదారపు విజయేందర్ రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్వింద్‌పై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపారు.

శతాధిక వృద్ధుడి మృతి


నర్సయ్య(ఫైల్)

కోనరావుపేట, మే 10: కోనరావు పేట మండలం నిమ్మపల్లి గ్రామా నికి చెందిన శతాధిక వృద్ధుడు విశ్వతి నర్సయ్య(104) శుక్రవారం మృతి చెందాడు. నర్సయ్య తనపని తాను చేసుకుంటూ ఇన్ని రోజులు ఆరోగ్యంగా ఉన్నాడు. వారం రోజులుగా ఆరోగ్యం క్షీణించి మృతి చెందాడు. వృద్ధుడు నర్సయ్యకు భార్య నర్సవ్వ, ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కాగా పెద్ద కొడుకు నర్సయ్య గత సంవత్సరం మృతి చెందాడు.

జగిత్యాలలో తనిఖీలు

జగిత్యాల టౌన్, మే 10 : జగిత్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, మంచినీళ్ల బావి తదితర ప్రాంతాల్లో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల వద్ద రూ. 1.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి పత్రాలు లేని వాహనాలు పట్టుకుని జరిమానాలు విధించారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు నరేష్ , మన్మధరావు తదితరులు ఉన్నారు.

ధర్మపురిలో ప్రత్యేక పూజలు


నరసింహుడి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ధర్మపురి, మే 10: ధర్మపురి క్షేత్రంలో అక్షయ తృతీయ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం వేళలో స్థానిక శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ దేవాలయాల్లో ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, ముత్యాలశర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచార్యులు, అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయం ఆవరణలో ఏటా నిర్వహించే విధంగా లోక క్షేమార్థం నరసింహ ఉపాసకులు, హైదరాబాద్ శ్రీనిఖిల్ చేతన కేంద్రం వ్యవస్థాపకులు శ్రీ సద్గురు అనిల్ కుమార్ జోషీ ఆధ్వర్యంలో శిష్య బృందం జ్వాల లక్ష్మీ నరసింహ మూల మంత్ర హవనం, పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనేక మంది భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. సాయంత్రం వేళలో పొన్న చెట్టు సేవ ఆలయం చుట్టు ప్రదక్షిణం నిర్వహించారు. భక్తులకు సమస్యల నివారణ కోసం సాధన మార్గాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వివిధ రాష్ట్రాలకు చెందిన 500 మంది శిష్యులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

మెట్‌పల్లి రూరల్, మే 10: మండలంలోని సత్తక్కపల్లి గ్రామంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణాన్ని నిర్వాహకులు ఘనంగా జరిపారు. శుక్రవారం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం పురోహితుల వేదమంత్రోచ్ఛారణల మధ్య స్వామి కల్యాణం కన్నుల పండుగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు, భక్తులు స్థానికులు పాల్గొన్నారు.

మైలారం మల్లన్న ఆలయంలో చోరీ

తంగళ్లపల్లి, మే 10: తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామంలో మైలారం మల్లన్న దేవాలయంలో చోరీ జరిగింది. గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు దేవాలయం తాళాలు పగలగొట్టి దేవాలయంలోని రూ 20 వేల విలువైన రెండు ఇత్తడి గంటలు, ఇత్తడి మల్లన్న విగ్రహాలను ఎత్తుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

ధర్మారం,మే10: ధర్మారం మండల కేంద్రంలో గల సాయిమణికంఠ పాఠశాల సమీపంలో గురువారం రాత్రి ఆటో బోల్తాపడిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన జంగిలి బక్కయ్య(62) కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. గురువారం రాత్రి ధర్మారంలో జరిగిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సభకు వచ్చిన ఐదుగురు ఆటోలో తిరిగి వెళ్తుండగా ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జంగిలి బక్కయ్య అనే వ్యక్తికి తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఆటోను అతి వేగంగా నడిపిన డ్రైవర్ పోతు లచ్చయ్యపై కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

సిరిసిల్ల క్రైం, మే 10: సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేట బైపాస్ రోడ్డులో ద్విచక్రవాహనంపై నుండి పడి సంపత్(28) అనే యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. కరీంనగర్ శివారులోని చింతకుంట గ్రామానికి చెందిన సంపత్ సిరిసిల్లలోని ఓ ఫైనాన్స్ సంస్థలో సెల్స్ మెన్‌గా పనిచేస్తుంటాడు. ఇతను విధులు ముగించుకొని ద్విచక్రవాహనంపై సిరిసిల్ల నుంచి కరీంనగర్‌కు వెళుతుండగా రోడ్డుపై వడ్లు ఆరబోసేందుకు అడ్డంగా పెట్టిన రాళ్ల తగిలి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో సంపత్ తలకు బలంగా దెబ్బలు తగలడంతో తీవ్రమైన రక్తస్రావం అయింది. ఈ ప్రమాదం శబ్ధం విన్న చంద్రంపేటకు చెందిన యువకులు రోడ్డుపై రక్తపు మడుగులో పడిపోయి కొట్టుమిట్టాడుతున్న సంపత్‌ను చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించి సెల్‌ఫోన్ ఆధారంగా అతని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఆ యువకుడి పరిస్థితి విషమించడంతో కుటుంబసభ్యులు మెరుగైన చికిత్సకోసం కరీంనగర్‌కు తరలించారు. బైపాస్ రోడ్డులో వీధి దీపాలు లేకపోవడంతో చీకట్లు కమ్ముకున్నాయి. మరోవైపు ఒకే సైడ్ రోడ్డునుంచి రాకపోకలు సాగడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ప్రాంతంలో వీధిదీపాలు ఏర్పాటుచేసి రెండువైపుల రాకపోకలను సాగేలా రోడ్డును మరమ్మత్తుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఒకరికి తీవ్ర గాయాలు

చందుర్తి, మే 10: చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో జోగాపూర్ గ్రామం చెందిన ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం జోగాపూర్ గ్రామంకు చెందిన బైరి శేషాద్రి వేములవాడ నుండి స్వగ్రామమైన జోగాపూర్ గ్రామానికి బైక్‌పై వెళుతుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో శేషాద్రికి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వేములవాడలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై విచారణ జరుపుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

పోలీసు కస్టడీకి
తప్పుడు రిజిస్ట్రేషన్ కేసు నిందితులు

కరీంనగర్ క్రైం, మే 10: అప్పు తీసుకుని తిరిగి ఇవ్వకపోగా, ఆ డబ్బులకు వేరొకరికి చెందిన ఇంటి స్థలాన్ని అసలు యజమానికి బదులుగా తప్పుడు వ్యక్తితో రిజిస్ట్రేషన్ చేసిన కేసులో నిందితులు దేవసాని శ్రావణ్‌కుమార్, పోరండ్ల శ్రీనివాస్ లను కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్ కుమార్ శుక్రవారం కస్టడీకి తీసుకున్నారు. ఈ కేసులో ఈ నెల 4వ తేదీన నిందితులు ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. కాగా ఈ కేసుకు సంబంధించిన మరింత కీలక సమాచారం సేకరించేందుకు నిందితు లిద్దరిని శుక్రవారం ఉదయం 11 నుంచి శనివారం ఉదయం 11 గంటల వరకు పోలీస్ కస్టడీ లోకి తీసుకుని విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఇల్లందకుంట, మే 10: మండలంలోని శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన మేకల తిరుపతి, రమ, సతీష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజకుమార్ శుక్రవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన సౌమ్యజకు దళితబంధు పథకంలో రూ. 10లక్షలు మంజూరయ్యాయి. ఆమెకు సెట్రింగ్ కొటేషన్ ఇప్పిస్తాన ని గతంలో చాలా మందికి ఇప్పించానని, శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన మేకల తిరుపతి హైద్రాబాద్‌కు చెందిన సాయి బాలాజీ ట్రేడర్స్‌కు దళితబంధు పథకంలోని డబ్బులు రూ. 5లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయించారు. ఆ డబ్బులు సౌమజ్యకు ఇవ్వకుండా తిరుపతి తన భార్యకు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. తనను మోసం చేశారని సౌమ్యజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపతి, రమ, సతీష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాహనం స్వాధీనం

తిమ్మాపూర్, మే10: మండలంలోని రేణికుంట వద్ద రాజీవ్ రహదారిపై పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గురువారం రాత్రి హైదారాబాద్ వైపు నుంచి కరీంనగర్ వైపునకు వస్తున్న కారు(ఏపీ09 ఏజె 1128)లో గులాబీ రంగు పకిడి రుమాల్ టోపీ క్లాత్‌లు 750 వరకు గుర్తించి వాహనం స్వాధీనం చేసుకున్నామని ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపారు. ఇవి బీఆర్ఎస్ పార్టీ రోడ్ షో కార్యక్రమంకు తీసుకుపోతున్నరని గుర్తించిన పోలీసులు, తరలిస్తున్న కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులు మహమ్మద్ కరీముద్దీన్, అబ్దుల్ సలాం, సయ్యద్ ఫయాజ్ హుస్సేన్ లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చేరాలు తెలిపారు.

బెల్ట్‌షాప్‌లో మద్యం పట్టివేత

మల్యాల, మే 10: మండలంలోని లంబాడిపల్లిలో గల బెల్ట్‌షాప్‌లో మద్యం పట్టుకున్నట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు. బల్కం గంగమహేష్ అనే వ్యక్తి బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్నాడనే సమాచారం మేరకు దాడులు చేసి 17లీటర్ల రాయల్‌స్టాగ్ మద్యం పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.

రాజక్కపల్లిలో..


వెల్గటూర్, మే 10: మండలం లోని రాజక్కపల్లిలో శుక్రవారం రాత్రి మద్యం బాటిళ్లు పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మహేంధర్ సింగ్ తెలిపారు. మద్యం తరలిస్తున్న మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలీసుల తనిఖీల్లో నగదు పట్టివేత



పట్టుకున్న నగదును చూపుతున్న సీఐ విజయ్‌కుమార్

కరీంనగర్ క్రైం, మే 10: నగరంలోని ఐబీ చౌరస్తా వద్ద కరీంనగర్ రెండో రాణా పోలీసులు శుక్రవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల వద్ద 18 లక్షల 75 వేల 651 రూపాయలు నగదును పట్టుకున్నారు. సరైనా ఆధారాలు, రశీదులు లేకుండా డబ్బులు తరలిస్తుండగా పట్టుకున్నామని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. రామడుగు మండలం గుండి గ్రామానికి చెందిన గమ్మడి రమేష్ సరైన ఆధారాలు చూపకుండా రూ. 6 లక్షల నగదు కలిగి ఉండగా పట్టుకున్నామని తెలిపారు. అలాగే మానకొండూర్ మండలం ఊటూరు గ్రామానికి చెందిన పడాల హరీష్ వద్ద 12 లక్షల 75 వేల 651 రూపాయలు పట్టుబడ్డాయని తెలిపారు. పట్టుబడిన మొత్తం నగదు 18,75,651ను తదుపరి ప్రక్రియ నిమిత్తం సంబంధిత ఎన్నికల అధికారులకు స్వాధీనం చేశామని సీఐ తెలిపారు. కాగా టవర్ సర్కిల్ వద్ద కరీంరగర్ ఒకటో రాణా పోలీసులు శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో మానకొండూర్ మండలం చెంజర్ల గ్రామానికి చెందిన అలగం కుమారస్వామి వద్ద 88 వేల రూపాయలను పట్టుకున్నారు. పట్టుబడిన డబ్బును తదుపరి చర్యల కోసం సంబంధిత అధికారుల వద్దకు తరలించామని పోలీసులు తెలిపారు.



రాజస్వామి సేవలు మరువలేనివి

కరీంనగర్ టౌన్, మే 10: డీటీఎఫ్ ఉమ్మడి జిల్లాశాఖ కార్యదర్శిగా, రాష్ట్ర కౌన్సిలర్‌గా పనిచేసిన చీర్ల రాజస్వామి డిసిఇబి సెక్రటరీగా, రిటైర్డు హెడ్మాస్టర్‌గా చేసిన సేవలు మరువలేనివని డిటిఎఫ్ శ్రేణులు పేర్కొన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతిచెందిన రాజస్వామి అంత్యక్రియలు నిర్వహించారు. ముందుగా ఆయన భౌతికకా యాన్ని డిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు టి.లింగారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యుల రాజిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి అటుకుల శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ఎం.రఘుశంకర్‌రెడ్డి, కె. నారాయణరెడ్డి, రాష్ట్ర పూర్వ కార్యదర్శి కోహెడ చంద్రమౌళి, రాష్ట్ర పూర్వ ఆడిట్ కమిటీ కన్వీనర్ డి.ఎసురెడ్డి, కరీంనగర్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి, ఎ.తిరుపతి, వివిధ జిల్లాల బాధ్యులు, రాష్ట్ర కౌన్సిలర్లు, మండల బాధ్యులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, బంధువులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు సందర్శించి పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.

రూ.7,100 పలికిన పత్తి ధర

జమ్మికుంట, మే 10: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ యార్డులో క్వింటాల్ పత్తి ధర 7,100 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు నలుగురు రైతులు 73క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,100, కనిష్ఠ ధర 6,860 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. శని, ఆదివారాలు సాధారణ సెలవులు ఉంటాయి. కాగా సోమవారం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సెలవు ప్రకటించారు. దీంతో మంగళవారం నుంచి పత్తి కొనుగోళ్లు కొనసాగనున్నాయి.

విద్యార్థులకు అభినందన

చొప్పదండి, మే 10: మండలంలోని రుక్మాపూర్ సైనిక్ స్కూల్ విద్యార్థులు యూపీఎస్‌ఈ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌డీఏ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ప్రతిభ చాటడంతో శుక్రవారం పలువురు అభినందిచారు. ఇటీవల నిర్వహించిన ఎన్‌డీఏ పరీక్షలో వి అభిలాష్, ఆర్ సిద్ధార్థ్, జి వినయ్‌కుమార్, జె నరసింహులు, ఎం విష్ణువర్ధన్‌లు ప్రవేశ పరీక్షకు హాజరై ఉత్తీర్ణత సాధించి ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు. కాగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సెక్రెటరీ సీతాలక్ష్మి, డైరెక్టర్ కెసి రావు, ప్రిన్సిపాల్ లచ్చయ్య, ఓఎస్‌డి పిఎస్ శర్మలు అభినందించారు.

'రిజర్వేషన్ల జోలికి వస్తే తరిమికొడుతాం'

సుభాష్‌నగర్, మే 10: రాజ్యాంగం జోలికి వస్తే తరిమి కొడతామని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి మహేశ్ అన్నారు. శుక్రవారం నగరంలో తళిత సంఘాల ఐక్య వేదిక సమావేశం నిర్వహించారు. . సమావేశంలో మాదిగ సంఘం నాయకుడు సంపతి అశోక్, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట ఆనాయకుడు సాంబారి కొమురయ్య, దళిత సంఘాల రాష్ట్ర నాయకుడు కంసాల శ్రీనివాస్, ఈశరి జస్వంత్, క్యాదాసి ప్రభార్, భీమారం సతీష్, నీరుకుల్లా అనిల్, వంతడుపుల సంపత్, నిజాంపేట శ్రీనివాస్, కనుమల్ల శ్రీనివాస్, బుర్ర సోమయ్య, తాటిపల్లి ప్రభు, దరిపల్లి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణయ్యపై దాడి హేయమైన చర్య

గణేశ్‌నగర్,మే 10: బీసీ సంక్షేమ, యువజన, మహిళా సంఘం ఆధ్వర్యంలో బీసీ ఉద్యమ నేత ఆర్ కృష్ణయ్యపై జరిగిన దాడిని ఖండిస్తూ నగరంలోని బైపాస్ రోడ్డు ఎన్టీఆర్ విగ్రహం దగ్గర బీసీ సంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసిపెద్ది శ్రీధర్ రాజు, సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం పటేల్, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్, మహిళా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గున్నాల కన్నాంబ, జిల్లా కన్వీనర్ మియాపురం రవీంద్రచారి, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ బావిలో పడి ఒకరి మృతి



రమేశ్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మే 10: ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌లో రెండు రోజుల కిందట అదృశ్యమైన భవన నిర్మాణ కార్మికుడు గడ్డి రమేశ్ (42) ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. కుటుంబ సభ్యులు, ఎస్‌ఐ రమాకాంత్ కథనం మేరకు.. గ్రామంలోని రమేశ్ భవన నిర్మాణ కార్మికుడిగా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. ఈ నెల 8న పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన అతడు తిరిగి సాయంత్రం బయటకు వెళ్లాడు. మద్యం తాగి ఇంటికి వస్తున్న క్రమంలో దారి పక్కన ఉన్న ఓ వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు పడ్డాడు. చీకటి పడినా రమేశ్ ఇంటికి చేరుకోకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు, బంధువులు, స్థానికులు గాలించారు. ఆచూకీ తెలియరాలేదు. అనుమానం వచ్చి శుక్రవారం ఉదయం ఇంటి సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలో చూడగా రమేశ్ మృతదేహం కనిపించింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు చేరుకున్నారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రమాకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని స్థానికులు సహాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు. కుటుంబ పెద్ద విగత జీవిగా కనిపించడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు. మృతుడికి భార్య స్వప్న, ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎంపీటీసీ బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ సుభాష్, మాజీ సర్పంచ్ రవీందర్ కోరారు.

ట్రైనీ కానిస్టేబుళ్లకు ఎన్నికల విధులపై శిక్షణ



మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి

కరీంనగర్ క్రైం, మే 10: ఎన్నికల విధుల గురించి ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్లకు కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి పలు కీలక సూచనలు చేశారు. ఈ మేరకు శుక్రవారం రాంనగర్‌లోని పోలీస్ ట్రైనింగ్ కళాశాల (పీటీసీ), కరీంనగర్ బైపాస్‌లోని కమిషనరేట్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్(సీపీటీసీ)లో ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్లకు ఎన్నికల రోజు నిర్వహించే విధుల గురించి సీపీ పలు కీలక సూచనలు చేసారు. ఎన్నికలరోజు ముందు రోజు ఆదివారం రోజున ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ అధికారులు, సిబ్బంది ఎన్నికల సామాగ్రిని, ఈవీఎంలను స్వీకరించిన తరువాత వాటికి భద్రతగా వారితో పాటు, కేటాయించిన పోలింగ్ లొకేషన్, కేంద్రాన్ని తెలుసుకుని వారి వెంటే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నప్పటి నుంచి ఎన్నికలు ముగిసే వరకు ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని సూచించారు. పోలింగ్ సమయం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్ణయించబడినప్పటికీ పోలింగ్ రోజున ఉదయం 6 గంటలకే విధులకు హాజరై సంసిద్ధంగా ఉండాలన్నారు. పోలింగ్ రోజున ఓటర్లను క్యూ పద్ధతిలో ఉండేలా చూసుకోవాలన్నారు. ఓటు వేసేందుకు వచ్చే మహిళలు, వృద్ధులతోపాటు అన్ని వర్గాల ప్రజలతో సత్ప్రవర్తనతో మెదలాలన్నారు. ఏదైనా పోలింగ్ కేంద్రం వద్ద శాంతి భద్రతల సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించి వాటిని నివారించేందుకు రూట్ ఆఫీసర్, స్ట్రైకింగ్ ఫోర్స్ స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ అధికారులను కేటాయిం చామని, ఆయా అధికారుల ఫోన్ నంబర్లను ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని, సమస్యలు తలెత్తితే వెంటనే వారికి తెలపాలని సూచించారు. ప్రిసైడింగ్ అధికారి అనుమతి లేనిదే ఎట్టిపరిస్థితుల్లో పోలింగ్ కేంద్రంలోకి వెళ్లరాదని, వారు పిలిస్తేనే వెళ్లాలని సూచించారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వుంటూ ఎన్నికలు ప్రశాంతగా ముగిసేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ట్రైనింగ్ కళాశాల ప్రినిసిపాల్ శ్రీనివాస్‌తో పాటు కమిషనరేట్ పోలీస్ సెంటర్ ప్రిన్సిపల్ ఏ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రులు తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ రవినాయక్

సుభాష్‌నగర్/తిమ్మాపూర్, మే 10: అన్ని ప్రైవేటు ఆసుపత్రులు తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలి వెల్‌ఫేర్ డాక్టర్ రవినాయక్ అన్నారు. శుక్రవారం తిమ్మాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రోగ్రాం ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రులు రిజిస్ట్రేషన్‌తో పాటు ఫైర్ సేఫ్టీ, వసతులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆడిట్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో డీటీసీవో డాక్టర్ కెవీ రవీందర్‌రెడ్డి, డిఐవో డాక్టర్ సాజిదాఅతహరి, పివో డిటిటి డాక్టర్ రాజగోపాల్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జువైరియా, ఎంసీహెచ్ పీవో డాక్టర్ సనాజువేరియా, రంగారెడ్డి, కాంతారావు, డాక్టర్ శిల్పారెడ్డి, తులసి రవిందర్ పాల్గొన్నారు.

రూ.30 వేల విలువైన

మద్యం పట్టివేత

ఎల్లారెడ్డిపేట, మే 10: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు పదిర గ్రామంలోని బెల్టు షాపు, ఓ రాజకీయ పార్టీ నాయకుడి ఇంటిలో మద్యం నిల్వ చేశారనే సమాచారంతో ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలోని అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. మండల కేంద్రంలోని ఓ రాజకీయ పార్టీ నాయకుడు ఓటర్లకు మద్యం పంచేందుకు తీసుకు వచ్చి అక్రమంగా నిల్వ చేసిన రూ.30 వేల విలువైన మద్యం సీసాలను స్వాధీన పర్చుకున్నారు. మద్యం సీసాలను ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించామని సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. పదిరలో ఎన్నికల నేపథ్యంలో బెల్టు దుకాణంలో నిల్వ చేసి ఒక్కో బీరు సీసాకు రూ.40 అధనంగా విక్రయిస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ వివరించారు.

తడిసిన ధాన్యం

- కొనుగోళ్లు జరుగుతుండగానే కుండపోత వర్షం
- ఆందోళనలో అన్నదాతలు



కథలాపూర్‌లో తడిసిపోయిన ధాన్యం

కథలాపూర్, మే 10: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం కురిసిన అకాల వర్షం కారణంగా వరి ధాన్యం పూర్తిగా తడిసి పోయింది. భూషణరావుపేట, కథలాపూర్, దుంపెట, చింతకుంట, పెగ్గెర్ల, ఊట్‌పల్లి గ్రామాల్లోని సెర్ప్, ప్యాక్స్ కేంద్రాల్లో కొనుగోళ్లు జరుగుతున్న క్రమంలోనే అనూహ్యంగా వర్షం కురవడంతో సంచులన్నీ తడిసిపోయాయి. నెల రోజులుగా కేంద్రాల్లో కొనుగోళ్ల కోసం వేచి చూస్తున్న రైతులకు ఒక్కసారిగా కురిసిన వర్షం వల్ల తీవ్ర నష్టం వాటిల్లనుంది. సుమారు అరగంట సేపు కుండపోత వాన కురిసి వడ్ల సంచులన్నీ తడిసాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వరుసగా కురుస్తున్న వర్షాలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కాగా కేంద్రాల నిర్వాహకులు టార్పాలిన్లు నిల్వ ఉంచకపోవడం వల్ల ధాన్యం తడిచిపోతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. ఈదురు గాలులకు పలు చోట్ల మామిడి కాయలు రాలిపోయాయి.

చెత్త కుప్పలో పసికందు మృతదేహం

హుజూరాబాద్, మే 10: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లోని మరుగుదొడ్ల వెనుక భాగంలోని చెత్తకుప్పలో పసికందు మృతదేహం శుక్రవారం లభ్యమైంది. మరుగుదొడ్ల పక్కన చెత్తకుప్పల నుంచి దుర్వాసన రావడంతో బస్టాండులోని దుకాణాదారులు అక్కడికి వెళ్లి చూశారు. అక్కడ పసికందు మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకి చేరుకుని పరిశీలించారు. పసికందును రెండు రోజుల క్రితం అక్కడ పడవేసినట్లు భావిస్తున్నారు. మృతదేహాన్ని హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

గంగాధర, మే 10: గంగాధర మండలం మంగపేట శివారులో బావిలో పడి వివాహిత ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివారల ప్రకారం.. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం తుర్కకాశీనగర్‌కు చెందిన కరీమా(27) అనే వివాహిత శుక్రవారం గంగాధర మండలం మంగపేట శివారులోని బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. వివాహిత బావిలోకి దూకిన విషయం తెలుకున్న స్థానిక యువత రక్షించడానికి ప్రయత్నించారు. అప్పటికే చనిపోయి నీటిలో మునిగి పోయింది. సమాచారం మేరకు ఎస్‌ఐ కిరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు చేరుకుని బావిలోని నీటిని తోడి మృతదేహాన్ని తీయడానికి ప్రయత్నిస్తున్నారు. మహిళకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

సుల్తానాబాద్, మే 10: సుల్తానాబాద్ పట్టణంలోని మార్కండయ్య కాలనీకి చెందిన చింతల రాజు(19) అనుమానాస్ప ద స్థితిలో శుక్రవారం మృతిచెందాడు. గురువారం రాత్రి మిత్రులతో కలిసి ఉన్నవాడు మరునాడు మధ్యాహ్నం బావిలో శవమై తేలాడు. రాజు ఆత్మహత్యకు పాల్పడ్డాడా, లేక ఎవరైనా చంపి బావిలో పడవేశారా అనే అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యులు, కాలనీ వాసుల కథనం ప్రకారం.. సుల్తానాబాద్ పట్టణంలోని మార్కండయ్య కాలనీకి చెందిన చింతల శ్రీనివాస్ పెద్ద కుమారుడు చింతల రాజు గురువారం రాత్రి మిత్రులతో కలిసి తిరిగాడు. కానీ ఆరోజు ఇంటికి రాలేదు. అతని మిత్రుడు ఒకరు రాజు సెల్‌ఫోన్ మరిచిపోయాడు అంటూ వారి ఇంటికి తెచ్చిఇచ్చి వెళ్లిపోయాడు. దాంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు, బంధువులు అతడి జాడ కోసం వెతికినా ఆచూకీ దొరకలేదు. రైల్వే గేట్ సమీపంలో ఉన్న బావికి కొద్ది దూరంలో రాజు బైక్ ఉండగా, బావి వద్ద చెప్పులు ఉన్నాయి. దాంతో అనుమానం వచ్చి బావిలో వెతకగా మృతదేహం లభ్యమయింది. మృతదేహాన్ని శుక్రవారం సాయంత్రం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గడ్డివాము దగ్ధం

చిగురుమామిడి, మే 10: మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో కత్తుల దేవేందర్ అనే రైతు వ్యవసాయ బావి వద్ద ట్రాన్స్‌ఫార్మర్ బాక్సులు కొట్టివేయడంతో మంటలు చెలరేగి సమీపంలోని 15 ట్రిప్పుల గడ్డివాము పూర్తిగా దగ్ధమైంది. సమీపంలో పశువులు ఉండడంతో వేడి తీవ్రతకు లేగదూడ మృతిచెందింది. మిగతా పశువుల తాళ్లను దేవేందర్ తొలగించడంతో పమాదం నుంచి బయటపడ్డాయి. సుమారు 300 గడ్డికట్టలు కాలిపోవడంతో తీవ్రనష్టం వాటిల్లిందని బాధితుడు దేవేందర్ తెలిపాడు.

ధాన్యం రవాణాకు లారీల కొరత

- సంచికి రూ.1-2 ఇస్తేనే వస్తున్న లారీలు
- నత్తనడకన కొనుగోళ్లు
- ఇబ్బందులు పడుతున్నరైతులు



కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం కుప్పలు

మల్యాల, మే 10: వరి ధాన్యం తరలించేందుకు గాను లారీల కృత్రిమ కొరతతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అదనపు తూకం, అదనపు వసూళ్లతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సహకార సంఘాలు, ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తుండగా నాణ్యత ప్రమాణాల పేరిట ధాన్యం త్వరితగతిన తరలించకపోగా తూకం వేసిన ధాన్యం తరలించడానికి లారీల కొరత ఏర్పడుతోంది. రోజుల తరబడి తూకం కోసం ఎదురుచూపులు, అకాల వర్షాల నేపథ్యంలో ఇంకా కొనుగోలు కేంద్రాలలోనే ఉంటే నష్టపోవాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. తూకం వేసిన ధాన్యం త్వరితగతిన తరలించాలంటే సంచికి రూ.1నుంచి 2 చెల్లిస్తేనే లారీలు అందుబాటులో ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ డబ్బులు చెల్లించకపోతే లారీలు రావడం లేదని అంటున్నారు.

● **కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు**

ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా పూర్తి కావాల్సి ఉండగా ధాన్యం తరలింపునకు లారీలు రాకపోవడం, అకాల వర్షాలతో రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాలలో పడి గాపులు పడుతున్నారు. ఐకేపీ కొనుగోలు కేంద్రాలలో దాదాపుగా 5వేల తూకం వేసిన సంచులు తరలించడానికి ఉన్నాయి. తమ ధాన్యానికి మొశ్చరు వచ్చి అనేక రోజులు గడుస్తున్నప్పటికీ తూకం మాత్రం వేయడం లేదని అకాల వర్షాలు కలవరపెడుతున్నాయని మరి కొందరు రైతులు చెబుతున్నారు. లారీలు కొరతపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా మని రైతులు ఆందోళన చెందవద్దని ఐకేపీ ఏపీఎం రాజయ్య తెలిపారు.

● **కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా..**

లారీల కొరత, ధాన్యం అదనపు తూకంపై సివిల్‌సప్లై కమిషనర్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని పలువురు రైతులు పేర్కొంటున్నారు. లారీల సమస్య తీర్చాలని స్థానిక సివిల్‌సప్లై అధికారులను కమిషనర్ ఆదేశించినప్పటికీ ఇంకా లారీల కొరత అలాగే ఉందని పైగా డబ్బులు చెల్లిస్తేనే త్వరగా వస్తున్నామని అంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.



రవాణా కోసం సిద్ధంగా ఉన్న సంచులు

బీజేపీని ఆదరించండి

● విస్తృత ప్రచారం నిర్వహించిన నాయకులు, కార్యకర్తలు



వల్బాపూర్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

వీణవంక, మే10: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు ఓటు వేసి గెలిపించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి కోరారు. మండలం లోని పలు గ్రామల్లో బీజేపీ నాయకులు కార్యకర్తలు విస్తృత ప్రచారం చేశారు. వల్బాపూర్ గ్రామంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి బండి సంజయ్ గెలుపు కోసం విస్తృత ప్రచారం చేపట్టారు. కాగా మండలంలోని వల్బాపూర్ గ్రామం లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమములో గంగిడి మనోహర్ రెడ్డి,మండల అధ్యక్షుడు రామిడి అదిరెడ్డి,నాయకులుపెద్ది మాల్లారెడ్డి, మారముళ్ల కొంరయ్య, గోవిందరెడ్డి,విజేందర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

● జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెంలో బీజేపీ నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో ఆకుల రాజేందర్, పొనగంటి రవి, ఎ కిషన్, రావుల మహిపాల్, ఎ పోచయ్య, తాటికంటి మల్లేశం, పొనగంటి సతీష్, పొనగంటి ప్రశాంత్, ఆదర్శ్, అరుణ్, వెంకటేష్, అంజి, దేవప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

● సుభాష్‌నగర్: కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిగా బీజేపీ నుంచి పోటి చేస్తున్న బండి సంజయ్‌కే మున్నూరు కాపు సంఘం తెలంగాణ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు మున్నూరు కాపు యువత రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజీవ్ తెలిపారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. సమావేశంలో మున్నూరు కాపు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంగుల రాజేష్, రాష్ట్ర కార్యదర్శి ఇమ్మడి మోహన్, రాష్ట్ర నాయకులు చీరంజి తిరుపతి, యువత ప్రధాన కార్యదర్శి శ్రీనుపాల్గొన్నారు.

● భగత్‌నగర్: కాంగ్రెస్ గ్రాఫ్ రోజు రోజుకు పడిపోతుందని బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు అన్నారు. శుక్రవారం నగరం లోని 39వ డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్‌పై తీవ్రమైన ప్రజా వ్యతిరేకత ఉందన్నారు. మోదీ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం విశ్వాసం పెరిగిందన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో బండిసంజయ్‌కుమార్ 12 వేలకోట్ల రూపాయలతో అభివృద్ధి చేశారన్నారు. ప్రజా సమస్యలపై ఏనాడూ స్పందించని నాయకుడికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చిందన్నారు.

- బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ గ్రాఫ్ బహిరంగ సభల నుంచి వీధి సమావేశాల స్థాయికి పడిపోయిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు కొట్టె మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం నగరంలోని రాంనగర్, శ్రీహరినగర్, కురుమవాడ, విద్యానగర్ ప్రాంతాల్లో బీజేపీ సోషల్ మీడియా పార్లమెంట్ కన్వీనర్ ఉప్పరపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ మాటలను ప్రజలు విశ్వసించే స్థితిలో లేరన్నారు. కరీంనగర్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌పై చేసిన వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

● భగత్‌నగర్ : ముఖ్యమంత్రి ఉద్యోగం పోయి కేసీఆర్‌కు మతిభ్రమించిందని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయ ణరావు అన్నారు. శుక్రవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమవేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ అసత్యప్రచారాలతో ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. తండ్రి పేరు చెప్పుకుని రాజకీయాల్లోకి వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి ఏనాడూ ప్రజల్లో లేడన్నారు. సమావేశంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దురి శెట్టి సంపత్, కటకం లోకేష్, బొంతల కల్యాణచంద్ర, సోషల్ మీడియా కన్వీనర్ ఉప్పరపల్లి శ్రీనివాస్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

● భగత్‌నగర్: బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ గెలుపు ఖాయమని 37వ డివిజన్ బీజేపీ ఇంచార్జ్ వరాల దేవేందర్ అన్నారు. 37డివిజన్లో బండి సంజయ్‌ని గెలిపించాలని గడ పగడపకు ప్రచారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా 55వ డివిజన్ కార్పొరేటర్ పెద్దపల్లి జితేందర్ హాజరయ్యారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు అమర్, రమేష్,శ్రీకాంత్,రాజు డివిజన్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● కరీంనగర్‌రూరల్: కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్‌లో బీజేపీ నాయకులు ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఊరడి శివారెడ్డి, మెండె పోనింద్రయాదవ్, అనుముల తిరుపతి, రాజ్‌కుమార్, తొంటి శ్రీనివాస్, పాతెం నరేష్, ప్రకాష్, ఓరుగల రమేష్, పేరంమహేష్, పెంతాల శ్రీనివాస్, హరీష్, గోసెరామక్రిష్ణ, బెజ్జంకి వేణు, అనుముల అంజి, ఊరడి అశోక్, అనుమల నాగరాజు పాల్గొన్నారు.

● భగత్‌నగర్: నగరంలోని రేకుర్తి 17, 18, 19 డివిజన్లలో రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నమూనా బ్యాలెట్ వివరిస్తు ఇంటింటికి బొట్టు పెడుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొన్నాల రాములు, పర్వతం మల్లేశం, మహేశ్వర్‌రెడ్డి, నాంపల్లి శంకర్, పింగిలి ప్రతాప్‌రెడ్డి, ముదిమడుగుల లక్ష్మీరాజం, పీచల విష్ణుప్రసాద్‌రావు, గోదావరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

● గణేశ్‌నగర్: బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కే సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ అన్నారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు నాగుల కనకయ్య గౌడ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు , జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ , బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు నారోజు రాకేష్ చారి ఆధ్వర్యంలో గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు.

● భగత్‌నగర్: నగరంలోని 19 డివిజన్‌లో బీజేపీ నాయకుడు నరహరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రౌతు కిరణ్, కొలీ చరణ్, ఆంజద్, ప్రవీణ్, మహేష్, తిరుపతి పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తా ఆశీర్వదించండి

● కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు



మాట్లాడుతున్న వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్ అర్బన్, మే 10: అభివృద్ధి చేస్తా.. ఆశీర్వదించండి అంటూ కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు ఆర్ఎంపీ, పీఎంపీల సమ్మేళనంలో మాట్లాడారు. నగరంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం కరీంనగర్ ఉమ్మడి జిల్లా గ్రామీణ వైద్యులు ఆర్ఎంపీ, పీఎంపీల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణ గౌడ్, ఆర్ఎంపీ డాక్టర్స్ అసోసియే షన్ జిల్లా అధ్యక్షులు కాసం రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●బీజేపీ పైకి జై శ్రీరాం అంటూ లోలోపల మాత్రం రిజర్వేషన్లకు రాంరాం చెప్పాలని చూస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. కరీంనగర్ పద్మానాయక కళ్యాణ మండ˘ంలో కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావుకు మద్దతుగా ముదిరాజ్ కుల బాంధువుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పొరపా టున బీజేపీ గెలిస్తే బీసీ డిలో ఉన్న వారితోపాటు అన్ని రిజర్వేషన్లు ఏత్తేస్తుందన్నారు. బీజేపీకి ముదిరాజులు అంటే చిన్న చూపు అని, అందుకే వారి కులానికి చెందిన, అదే పార్టీలో ఉన్న ఈటల రాజేందర్‌ను ఓడిం చేందుకు విశ్వప్రయత్నాలు చేసిన ఘనుడు బండి సంజయ్ అని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు విమర్శించారు. ఐదేళ్ల ఎంపీగా ఉన్న బండి సంజయ్ నయాపైసా పనిచేయలేదన్నారు. అభివృద్ధి చేసే కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపాలన్నారు.

● గౌడకులస్థులు రాజకీయ, ఉపాధి, ఆర్థికంగా ఎదిగేందుకు అన్ని విధాల సహకారం అందించి అందరి అభివృద్ధికి అండగా ఉంటానని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపంలో శుక్రవారం గౌడ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఎల్లమ్మ తల్లి ఆశీర్వాదంతో గీతా కార్మికుడి బిడ్డగా తెలంగాణ మంత్రిగా అయ్యానని, ఇదే స్ఫూర్తితో కరీంనగర్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి రాజేందర్ రావును ఆశీర్వదించాలని కోరారు.

● భగత్‌నగర్: కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్ధతుగా సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు ఆధ్వర్యంలో కట్టరాంపూర్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర ఉపాధ్యక్షుడు బత్తిని చంద్రయ్యగౌడ్, కొంకటిమమత, మంజుల, పోచయ్య పాల్గొన్నారు.

- కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును భారీ మెజారిటీతో గెలిపించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని గణేష్‌నగర్‌లో ప్రచారం నిర్వహించారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ విద్యార్థి, యువకుల కోసం చేసిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

● గన్నేరువరం: దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ జరగాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని ప్రజలంతా కాంగ్రెస్‌కు ఓటు వేసి మద్ధతు పలకాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని గుండ్లపల్లి నుంచి గన్నేరువరం వరకు మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●శంకరపట్నం: కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా శంకరపట్నం మండల కాంగ్రెస్ పార్టీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. టీపీసీసీ మెంబర్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య తదితరులు ఉన్నారు.

- కేశవపట్నం మార్కెట్ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు తరుపున సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వెల్మరెడ్డి రాజిరెడ్డి ప్రచారం నిర్వహించారు.

● జమ్మికుంట రూరల్: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో ఇల్లందకుంట దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్‌రావును గెలిపించాలని కోరారు.

● ఇల్లందకుంట: మండల కేంద్రంతో పాటు సిరిసేడు, మల్యాల, రాచపల్లి గ్రామాల్లో ఉపాధిహామీ పథకం పనులు చేస్తున్న మహిళల వద్దకు వెళ్లి చేయి గుర్తుకు ఓటు వేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ అభ్యర్థించారు.

● వీణవంక: మండలంలోని జేతిగల్, వీణవంక, నర్సింగాపూర్, లస్మక్కపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు గెలుపు కోసం హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ గడపగడపలో ప్రచారం నిర్వహించారు.

●సైదాపూర్: భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్రదారులను తరిమి కొట్టాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సైదాపూర్ మండల కేంద్రంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బత్తుల బాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

ఉత్తర తెలంగాణ భవన్‌లో కేసీఆర్ బస

● అధినేతను కలిసిన పార్టీశ్రేణులు

కరీంనగర్ టౌన్, మే 10: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి కరీంనగర్‌కు చేరుకొని ఉత్తర తెలంగాణ భవన్‌లో బసచేసిన బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సిరిసిల్ల బస్సుయాత్రకు బయలుదేరి వెళ్లారు. శుక్రవారం కేసీఆర్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షు డు జీవీ రామకృష్ణారావుతోపాటు పలువురు నాయకులు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు కలిసి తాజా రాజకీయ పరిస్థితులను వివరించారు. సాయంత్రం కేసీఆర్ సిరిసిల్లకు బస్సులో వెళ్లారు.

రాజ్యాంగాన్ని కాపాడాలని గిరిజన బంజారాల ర్యాలీ

కరీంనగర్ అర్బన్, మే 10: రాజ్యాంగాన్ని మార్చా లన్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను చిత్తుగా ఓడిం చాలని, కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు ను గెలిపించాలని కోరు తూ ఆలిండియా గిరిజన బంజారా సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ నాయక్ ఆధ్వర్యంలో బంజారాలు శుక్రవారం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్‌స్టేషన్ నుంచి తెలంగాణ చౌక్, కెప్టెన్ విజయ రఘునందన్‌రావు మార్గ్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. ఆలిండియా గిరిజన బంజారా సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు భాస్కర్ నాయక్, రిటైర్డ్‌ప్రొఫెసర్ వీరన్న నాయక్ తదితరులు ఉన్నారు.

జిల్లా కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓటుపై అవగాహన

కరీంనగర్ స్పోర్ట్స్, మే 10: ఓటు హక్కును వినియోగిద్దాం..ప్రజాస్వామ్యాన్ని గెలిపిద్దాం అంటూ జిల్లా కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో కరాటే క్రీడాకారులు విన్యాసాలతో ఓటరు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో ప్లకార్డులు, స్లోగన్స్‌తో ర్యాలీ నిర్వహించారు. కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇ శ్రీనివాస్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర చైర్మెన్ కె వసంత్‌కుమార్, ఉపా ధ్యక్షుడు మాడుగుల ప్రవీణ్, ఆర్ ప్రసన్న కృష్ణ పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ వాహనం తనిఖీ

తిమ్మాపూర్, మే10: సిద్దిపేట జిల్లా, కోహెడ మండలంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని కరీంనగర్ వస్తున్న మంత్రి పొన్న ప్రభాకర్ వాహనాన్ని మండలంలోని రేణికుంట గ్రామం రాజీవ్ రహదారిపై టోల్ ప్లాజా సమీపంలో పోలీసులు తనిఖీ చేశారు పోలీసులకు మంత్రి పూర్తిగా సహకరించారు.

నేడు హుజూరాబాద్‌లో కేటీఆర్ రోడ్ షో

హుజూరాబాద్, మే 10: హుజూరాబాద్ పట్టణంలోని సూపర్ బజార్ చౌరస్తాలో శనివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ రోడ్ షో నిర్వహిస్తున్న ట్లు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర స్పోక్స్ పర్సన్‌కు ఘన స్వాగతం

సైదాపూర్, మే 10: సైదాపూర్ మండలంలోని దుద్దెనపల్లి గ్రామానికి చెందిన వేముల రమేష్ టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర స్పోక్స్ పర్సన్‌గా ఎన్నికైన తర్వాత మొదటి సారిగా శుక్రవారం సైదాపూర్‌కు రాగా కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు గుండారం శ్రీనివాస్, చాడ కొండాల్‌రెడ్డి, మిట్టపల్లి కిష్టయ్య, యాదగిరి, వెంకటేశం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ అబద్ధాల ప్రచారం

● కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్



క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

కరీంనగర్ టౌన్, మే 10: పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయ లబ్ధిపొందేందుకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డిలు బీజేపీ మళ్లీ గెలిస్తే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను రద్దు చేస్తారని, మరోవైపు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను రద్దు చేసి ముస్లింలకు ఇస్తారని బీజేపీ నాయకులు పచ్చి అబద్దాలతో డ్రామాలు ఆడుతున్నారని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. రిజర్వేషన్లు తీసే హక్కు ఎవరికీ లేదని, రెండు పార్టీలు రాజకీయాల కోసమే ఈ ప్రస్తావన తెరపైకి తెచ్చారని అన్నారు. శుక్రవారం ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ క్యాంపు కార్యాలయానికి దళిత సంఘాల ప్రతినిధులు వెళ్ళి వినోద్‌కుమార్‌కు మద్దతు ప్రకటించారు. ఈసందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ 2001లో తెలంగాణ ఉద్యమనేత కేసీఆర్ సారధ్యంలో తెలంగాణ ఉద్యమం పుట్టి 14 ఏళ్ళ సుదీర్ఘ పోరాటం చేయడంతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ 3 ద్వారా తెలంగాణ రాష్ట్రం సాధించుకోవ డం జరిగిందని అన్నారు. స్వరాష్ట్రంలో నూతనంగా నిర్మించిన సెక్రటేరియట్‌కు అంబేద్కర్ పేరు పెట్టడమే కాకుండా 125 అడుగుల భారీ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రాజ్యాంగం ద్వారా వచ్చిన రిజర్వేషన్లను రద్దు చేసే హక్కు ఎవరికి లేదని 2006లో సుప్రీం కోర్టు జడ్జి తీర్పు ఇచ్చారని, రిజర్వేషన్లను ఎవరూ ముట్టరాదని కూడా పేర్కొన్నారని వివరించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల మధ్య చిచ్చుపెట్టి గిసొంటి తప్పుడు రాజకీయాలు చేయడం భావ్యం కాదని అన్నారు. తనను ఎంపీగా గెలిపిం చాలని, ప్రతి సమస్యలపై పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకనవుతానని వినోద్‌కుమార్ వారిని కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి మహేశ్, వంతడుపుల సంపత్, సాంబారి కొమురయ్య, క్యాదాసు ప్రభాకర్, బీమారపు సతీష్, పారునంది జలపతి తదితరులు పాల్గొన్నారు.

● కరీంనగర్ టౌన్ : కరీంనగర్‌కు ఎంతో సేవ చేసిన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను ఈ ఎన్నికల్లో ఎంపీగా గెలిపించు కుంటేనే కరీంనగర్‌లో అభివృద్ధి పరుగులు పెడుతుందని, ఆయనను ఎంపీగా గెలిపించాలని బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సెల్ ప్రతినిధి, ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ కుర్మాచలం అనిల్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నగరంలోని బీఆర్ఎస్ నగరశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఎన్ఆర్ఐలు బాధ్యతగా పాల్గొని కీలకపాత్రను పోషించారని అన్నారు. పోరాడి సాధించుకున్న స్వరాష్ట్రంలో అభివృద్ధి ఫలాలను కేసీఆర్ అందే విధంగా రాష్ట్రాన్ని పాలించి దేశంలోనే తెలంగాణను నెంబర్-1 స్థానంలో నిలిపారని, అంతే కాకుండా ప్రపంచ దేశాల్లోని ఎన్ఆర్ఐలు తలెత్తుకునేలా, తెలంగాణ బిడ్డలు గర్వపడేలా అభివృద్ధి చేశారని అన్నారు. కాంగ్రెస్ పాలనలో సాగునీరు, కరెంటు కష్టాలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. బస్సు యాత్రలో కేసీఆర్ అన్ని వర్గాలకు అండగా ఉంటామని భరోసా ఇస్తున్నారని చెప్పారు. ఎంపీగా వినోద్‌కుమార్ కరీంనగర్‌కు ఎంతో సేవ చేశారని, స్మార్ట్‌సిటీ సాధనలో ఆయన పాత్ర కీలకమని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో ఎంపీగా వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కరీంనగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషిచేశారని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్‌రెడ్డి, ఎన్ఆర్ఐ సెల్‌ప్రతినిధులు రాజ్‌కుమార్, ప్రశాంత్, ప్రవీణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

● మానకొండూర్ : కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినిపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా మానకొండూర్‌లో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు జీవి రామకృష్ణారావు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటు వేసి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనుల వద్దకు వెళ్లి మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసి కారు గుర్తుకు ఓటు వేయాలని కూలీలను వేడుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్ నాయకులు ఉన్నారు.

● గంగాధర: మండలంలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాగిరెడ్డిపూర్, బూరుగుపల్లి, మధురానగర్, గంగాధర, గట్టుబూత్కుర్, గర్షకుర్తి గ్రామాల్లో నాయకులు కేసీఆర్ అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటేయ్యాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నవీన్‌రావు, సింగిల్ విండో అధ్యక్షుడు బాలగౌడ్, మాజీ సర్పంచ్‌లు విజేందర్‌రెడ్డి,దామోదర్, అంజీ పాల్గొన్నారు.

● సుభాష్‌నగర్ : భారతీయ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కార్మిక సంఘాల మద్దతు బీఆర్ఎస్‌కేనని బీఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రశ్నించే గొంతు వినోద్‌కుమార్ అని ఆ గొంతు పార్లమెంట్‌లో వినిపించాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి బోయినిపల్లి వినోద్‌కుమార్‌కే ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్మిక చట్టాలను కాపాడుతాడని, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం సమస్యలపై పూర్తిఅవగాహన ఉన్న వ్యక్తి వినోద్‌కుమార్ అని తెలిపారు. ఆటో డ్రైవర్ల జీవితాలను రోడ్డున పడేసిన కాంగ్రెస్ పార్టీని బొందపెట్టాలన్నారు. కరీంనగర్ నియోజకవర్గ పరిధిలో ఉన్న సుమారు 20వేల మంది ఆటో డ్రైవర్ల కుటుంబాలు కారు గుర్తుకు ఓటేసి కార్మిక బల చాటాలన్నారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు మద్దెల రాజేందర్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేట్ విద్యా సంస్థలకు కొమ్ముకాస్తున్న డీఈవో'

హుజూరాబాద్, మే 10: జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలకు జిల్లా విద్యాధికారి కొమ్ము కాస్తున్నారని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కె రాణాప్రతాప్ అన్నారు. పట్టణంలో శుక్రవారం డివిజన్ పీడీఎస్‌యూ నాయకుల స మావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలలు నడుస్తున్న డీఈవో, ఎంఈవోలు పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు పలుమార్లు ఫిర్యాదు చేసిన పాఠశాలలపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రైవేట్ పాఠశాలల యజమానులు అడ్మిషన్ల కోసం ఏజెం ట్లను పెట్టుకొని పిల్లలను పాఠశాలల్లో చేర్పించుకుం టున్నారని తెలిపారు. విచ్చల విడిగా ఫీజులు వసూళ్లు చేస్తున్న పట్టించు కున్న దాఖలాలు లేవన్నారు. అనంతరం డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ కమిటీ అధ్యక్షుడిగా కె రవితేజ, ఉపాధ్యక్షుడిగా రాకేష్, ప్రధాన కార్యదర్శిగా అజయ్, సహాయ కార్యదర్శిగా శ్రీజ, కోశాధి కారిగా బన్ని, సభ్యులుగా అన్వేష్, సీవాస్, పవన్, నవీన్‌ను ఎన్నుకున్నారు.

విద్యార్థులు ప్రయోగాలపై దృష్టి సారించాలి

హుజూరాబాద్‌రూరల్, మే 10: విద్యార్థులు ప్రయోగాలపై దృష్ట సారించాలని కిట్స్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామం లోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఐఎస్‌టీఈ, మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్డీనో ఫర్ బిగినర్స్ అనే అంశంపై వారం రోజులుగా నిర్వహిస్తున్న అవగా హన సదస్సులో శుక్రవారం ఆయన మాట్లాడారు. కంప్యూటర్ రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని చెప్పారు. మార్పులకు అనుగుణంగా విద్యార్థులు ప్రతిరోజు కొత్త స్కిల్స్ నేర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్ట్‌లను ప్రద ర్శించారు. కార్యక్రమంలో కళాశాల ఆయా విభాగాధిపతులు సతీష్‌కుమార్, యోగేష్ పుండలిక్, రాజేశ్వర్‌రావు, మల్లయ్య, రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఐలో చేరిక

హుజూరాబాద్‌రూరల్, మే 10: మండలంలోని శాలపల్లి-ఇందిరానగర్ గ్రామ మాజీ సర్పంచ్ కోడిగూటి శారద ప్రవీణ్‌కుమార్ శుక్రవారం సీపీఐ జాతీయ కార్యవ ర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఆధ్వర్యంలో సీపీఐలో చేరారు. చాడ వెంక ట్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు.

బసవేశ్వరుడికి ఘన నివాళి

హుజూరాబాద్‌రూరల్, మే 10: మండలంలోని చెల్పూర్ గ్రామంలో బసవేశ్వర జయంతి సందర్భంగా శుక్రవారం వీర శైవ లింగాయత్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. కార్యక్రమంలో జిల్లా డీడీయస్ ఉపాధ్యక్షుడు బస్వాంగి శంకరయ్య, బసవేశ్వర వీరశైవ లింగాయతులు శీలం సాంబయ్య, మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

కరీంనగర్ మే10, ఆంధ్రజ్యోతి ప్రతినిధి: పోలింగ్‌కు ముందు 48 గంటలు పాటు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, ఓటర్లను ప్రలోభపెట్టే అంశంలో ఎలాంటి ఫిర్యాదు వచ్చినా వెంటనే స్పందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల ఏర్పాట్లపై అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్ నుంచి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఓటర్లను ప్రలోభ పెట్టే చర్యలను ఎక్కడికక్కడ అడ్డుకోవాలని, మద్యం, నగదు పంపిణీపై గట్టి నిఘా పెట్టాలని సూచించారు. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు.

● జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి శుక్రవారం సాయంత్రం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి పోలింగ్ బూత్‌లో ఏర్పాట్లు అన్ని బాగుండాలని సూచించారు. పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాట్లు అన్ని పకడ్బందీగా ఉండాలని పేర్కొన్నారు.

పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా 144 సెక్షన్

● పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి

కరీంనగర్ క్రైం, మే 10 : తెలంగాణ రాష్ట్రంలో లోకసభ ఎన్నికలు మే 13వ తేదీ సోమవారం జరగనున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలగకుండా, సజావుగా సాగేలా తీసుకునేటువంటి ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా 144 సెక్షన్ ఆఫ్ సీఆర్‌పీసీ అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి శుక్రవారం రోజు ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వులు 11వ తేదీ శనివారం రోజు సాయంత్రం 6 గంటల నుండి 13వ తేది సోమవారం పోలింగ్ ముగిసేవరకు, ఒకవేళ రీపోల్ జరిగితే అవికూడా ముగిసేవరకు అమలులో ఉంటాయని సీపీ తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్లను స్ట్రాంగ్ రూంలో భద్రపరచాలి

కరీంనగర్,మే10,ఆంధ్రజ్యోతి ప్రతినిధి: ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్న పోస్టల్ బ్యాలెట్ పత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచేందుకు అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. శుక్రవారం రాత్రి కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను కలెక్టర్ పరిశీలించారు.

రిజర్వేషన్లు ఎత్తివేసే కుట్ర

జమ్మికుంట, మే 10: రిజర్వేషన్లు ఎత్తివేసే కుట్రకు బీజేపి తెర తీస్తోందని మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జమ్మికుంట ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ కరీంనగర్ పార్లమెంటరీ కో-ఆర్డినే టర్ మొలుగూరి సదయ్య అధ్యక్షతన దళిత, గిరిజన ప్రజా చైతన్యయాత్ర సమావేశంలో మాట్లాడారు.

ఈ నెల 13న వ్యవసాయ మార్కెట్‌కు సెలవు

కరీంనగర్ రూరల్,మే10: ఈనెల 13వ తేదిన పార్లమెంట్ ఎన్నికలు ఉన్నందున కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ సెలవు ఉంటుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మంగళవారం యదావిధిగా ఉంటుందని రైతులు గమనించాలని కోరారు.

నిరుపేదలకు ఇళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే

కరీంనగర్ అర్బన్, మే 10:నిరుపేదలకు ఇళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ అన్నారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ ప్రభుత్వంలో కరీంనగర్ జిల్లాలోని పేదలకు 39,825 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారని అన్నారు.

ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి

కరీంనగర్ టౌన్, మే 10: ప్రజాస్వామ్య వ్యవస్థలో వజ్రాయుధం ఓటు హక్కు. ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని రిటైర్డు ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్ర మధుసూధన్‌రెడ్డి పిలుపునిచ్చారు.శుక్రవారం స్థానిక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించిన గాంధీ గుడి స్వచ్ఛంద సేవా సంస్థ చేపట్టిన ఓటరు చైతన్య యాత్ర ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ సి.రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

కరీంనగర్ టౌన్, మే 10: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధం... ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని దేశ భవిష్యత్‌కు బాటలు వేయాలని తెలంగాణ జనసత్తా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ముదుగంటి సుధాకర్‌రెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని భాగ్యనగర్‌లో ఏర్పాటు చేసిన 'ఓటరు కర్తవ్యం' అనే సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, స్వేచ్ఛగా ఓటు వేయాలన్నారు.